
సాక్షి రంగారెడ్డి

సోమవారం । 23 । జనవరి । 2023




పారిశ్రామిక కారిడార్‌గా..

రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉన్న కొత్తూరు మండలం పారిశ్రామిక కారిడార్‌గా దినదినాభివృద్ధి చెందుతోంది. 8లో▸



రక్షణ బాధ్యత షీ టీమ్స్‌దే

విద్యార్థులు, మహిళల రక్షణ షీ టీమ్‌లదేనని డీసీపీ శిరీష అన్నారు. షీటీమ్‌ల సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 8లో▸



బాలారిష్టాలు

జల్‌పల్లికి మున్సిపాలిటీ హోదా లభించి ఏడేళ్లు కావస్తున్నా బాలారిష్టాలను అధిగమించడం లేదు. 8లో▸

నివురుగప్పిన 'నిప్పు'!

నగరంలో షోరూమ్‌లు.. శివారులో గోదాములు

- ఇళ్ల మధ్యే గ్యాస్ సిలిండర్.. ప్లాస్టిక్ వ్యర్థాల నిల్వలు
- ఏ గోదాములో ఏముందో తెలియని పరిస్థితి
- అగ్నిమాపక పరికరాలు అంతంతే..
- రాంగోపాల్‌పేట్ ఘటనతో ఉలికిపాటు



కేశంపేటలోని ఓ కంపెనీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇళ్ల మధ్య వెలిసిన వాణిజ్య భవనాలు, గ్యాస్, ఇతర గోదాములు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు.. ఏ రూపంలో.. ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలో సేకరించిన వ్యర్థాలను శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు, గాజు సీసాలు, ఇతర వ్యర్థాలను వేరు చేసి విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన వారు ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. వీరి వద్ద కనీస అగ్నిమాపక పరికరాలు కూడా ఉండటం లేదు. నాసిరకం విద్యుత్ కేబుళ్లు, సామర్థ్యానికి మించి విద్యుత్ వాడుతుండటంతో తరచూ షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తి ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. ఈ సమయంలో వెలువడుతున్న దట్టమైన పొగతో ఊపిరాడక స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇటు గోదాములు..అటు పరిశ్రమలు

పారిశ్రామికవాడలతో పాటు నగరంలోని మెజార్టీ వాహన షోరూమ్‌లు, బేకరీలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఫర్నిచర్ దుకాణాలు, పెద్దపెద్ద వ్యాపార సముదాయాలకు సంబంధించిన గోదాములు శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులు, బల్క్ డ్రగ్ నిల్వలు, ఇతర రసాయన పదార్థాలను ఆయా గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. అవసరమైనప్పుడు ఆయా గోదాముల నుంచి నగరంలోని షోరూమ్‌లకు తరలిస్తుంటారు. ఆయా గోదాములు, వాణిజ్య భవనాల్లో సరైన అగ్నిమాపక పరికరాలు లేకపోవడం, ఉన్న వాటిలోనూ చాలా వరకు పని చేయకపోవడంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

తనిఖీలు చేయకుండానే ఎన్‌ఓసీలు..

జిల్లా వ్యాప్తంగా 1,74,911 వాణిజ్య భవనాలు ఉండగా, వీటిలో హోటళ్లు, స్కూళ్లు, కాలేజీలు, ఆస్పత్రులు,మల్టీప్లెక్స్ మాల్స్,ఫంక్షన్ హాళ్లు,వైన్స్, బార్లు ఎక్కువగా ఉన్నాయి. వీటితో పాటు మరో 8,972 పరిశ్రమలు, వాటికి సంబంధించిన గోదాములు ఉన్నాయి. మెజార్టీ భవనాల్లో కనీస అగ్నిమాపక పరికరాలు లేవు. ఉన్నవాటిలోనూ నీరు సరిపడా అందుబాటులో లేదు. నిర్వహణ లోపానికి నిర్లక్ష్యం తోడై తరచూ అగ్నిప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. సీఈఐజీ, అగ్నిమాపకశాఖ, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా భవనాలను తనిఖీ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. తనిఖీ చేయకుండానే నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారు.

ఇరుకైన ప్రదేశాల్లో గోదాములు

నిజానికి మండే స్వభావం ఉన్న వస్తువుల గోదాములు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. ఆ నిబంధనలను స్థానిక సంస్థలు అమలు చేయడం లేదు. అనేక చోట్ల గ్యాస్ గోదాములు ఇళ్ల మధ్యే ఉన్నాయి. ఆయా గోదాములు, పరిశ్రమలు ఉండే ప్రాంతాల్లో కనీసం 60 అడుగుల రోడ్లు ఉండాలి. జిల్లాలో చాలా చోట్ల ఆటో, రిక్షా కూడా వెళ్లలేని చిన్నచిన్న ప్రదేశాల్లో గోదాములు నిర్వహిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్, ఫైరింజన్ చేరుకోవడం కష్టంగా మారింది. నివాసేతర భవనాల విషయంలో 15 మీటర్ల కంటే తక్కువ ఎత్తుంటే స్థానిక సంస్థలు, ఎక్కువ ఎత్తున్న భవనాలకు అగ్నిమాపకశాఖ అనుమతి తప్పనిసరి. కానీ నిబంధనలు పట్టించుకోకుండానే ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆయువు తీస్తున్న వాయువు

చెత్త గోదాముల్లో చాలా వరకు ప్లాస్టిక్, గాజు సీసాలు నిల్వ ఉంటున్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వాటి నుంచి సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్‌మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతాయి. పొగ వ్యాపించినప్పుడు అక్కడున్న ఆక్సిజన్ శాతం ఒక్కసారిగా తగ్గిపోతోంది. శ్వాస ఆడడం కష్టమవుతుంది. ప్రస్తుతం వెలుగు చూస్తున్న అగ్ని ప్రమాదాల్లో మెజార్టీ మరణాలకు ఇదే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో షాద్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరంలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ, కొందుర్గు ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ 4,500 లీటర్ల సామర్థ్యం ఉన్న ఫైర్ ఇంజన్ ఉంది. పెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు ఇతర ప్రాంతాల్లోని ఫైర్ స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది.

న్యూస్‌రీల్

జేపీదర్గాలో ప్రార్థనలు అజ్మీర్‌దర్గాకు చాదర్



చాదర్‌ను తీసుకెళ్తున్న మైనార్టీ నాయకులు

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన చాదర్‌ను పలువురు మైనార్టీ నాయకులు ఆదివారం రాజస్థాన్‌లోని అజ్మీర్‌దర్గాకు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బాబాకు చాదర్ సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమూద్, నసీర్, పాషా, ఘనీ, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుర్రం ఇంద్రసేనారెడ్డి ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం పంచాయతీరాజ్ ఇంజనీర్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు ఇంజనీర్‌గా పని చేస్తున్న ఇంద్రసేనారెడ్డిని రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పెద్దలను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. 33 జిల్లాల నుంచి 350 మంది ఇంజనీర్లు మీటింగ్‌కు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానని స్పష్టంచేశారు.

రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల స్వాగతం



రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్రేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కొత్తూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్రేకు షాద్‌నగర్ నాయకులు ఆదివారం తిమ్మాపూర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. బిజినేపల్లిలో నిర్వహించిన దళితగిరిజన ఆత్మగౌరవ సభకు వెళ్తున్న నేతలకు స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు వీర్లపల్లి శంకర్, బాబార్‌ఖాన్, బాల్‌రాజుగౌడ్, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, మహేందర్, అంతయ్య, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆరోపణ
- కేశంపేట పీఎస్‌లో ఫిర్యాదు

కేశంపేట: కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆరోపిస్తూ ఓ మహిళ భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. మండల పరిధిలోని సంతాపూర్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల (మచ్చబొల్లారం)కు చెందిన రిఖితను 2022 మార్చిలో సంతాపూర్‌కు చెందిన భద్రారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత పదిహేను రోజుల పాటు బాగానే ఉన్న భర్త ఆతర్వాత కుటుంబ సభ్యులతో కలిసి అదనపు కట్నం వేధిస్తున్నారని బాధితురాలు ఆరోపించారు. గతేడాది ఏప్రిల్‌లో తనను విపరీతంగా కొట్టి పుట్టింటి వద్ద వదిలి వచ్చాడని తెలిపారు. అప్పటినుంచి తిరిగి కాపురానికి తీసుకురాలేదన్నారు. ఈ విషయమై అడిగేందుకు తన తల్లిగారి కుటుంబ సభ్యులతో కలిసి సంతాపూర్‌కు వచ్చామని తెలిపారు. తన భర్త, కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో ఇక్కడే టెంట్ వేసుకుని నిరసన చేపట్టామన్నారు. అనంతరం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ఈ విషయమై ఎస్‌ఐ ధనుంజయ్‌ను సంప్రదించగా ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వివేకానందుడి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్

యువతకు స్ఫూర్తి వివేకానందుడు

- గ్రామాల్లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి వివేకానందుడి విగ్రహావిష్కరణ

శంకర్‌పల్లి: మహనీయుల ఆశయ సాధనకోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండలంలోని గోపులారంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆదివారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. వివేకానందుడు యువతకు స్ఫూర్తి అని తెలిపారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి అని కొనియాడారు. ప్రతీ గ్రామంలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల చరిత్రను తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గోపులారం అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, ఇందుకోసం పాడువు సర్పంచ్ శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. గోపులారం నుంచి మొయినాబాద్ మండలం చిన్నమంగళారం వరకు మూసీ నదిపై నిర్మించాల్సిన వంతెన మంజూరైందని తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బ్రిడ్జి నిర్మాణంతో ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, మహారాజ్‌పేట్ ఎంపీటీసీ తొండ మల్లమ్మ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, నాయకులు వాసుదేవ్‌ఖన్నా, గొడిచర్ల వెంకటేశ్, బయన్న, బండమీద వెంకటయ్య, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత్ సాయం మరువలేనిది: రణతుంగ

బంజారాహిల్స్: శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి విలవిల్లాడుతున్న సమయంలో భారత్ చేసిన సహాయం మరువలేనిదని శ్రీలంక క్రికెట్ టీమ్ మాజీ అధ్యక్షుడు అర్జున రణతుంగ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.1లోని నందగిరిహిల్స్‌లో ఆదివారం కొలంబోలో ఆసియా ప్రధాన కార్యాలయంతో కొనసాగుతున్న కెనడియన్ కంపెనీ గ్లోబల్ చాయిస్ ఇమిగ్రేషన్ కేంద్రాన్ని (జీసీఐ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రణతుంగ మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీలంక పరిస్థితి కుదుటపడిందన్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇండియా ఆదుకున్న తీరు అద్భుతంగా ఉందన్నారు. హైదరాబాద్‌కు తాను క్రికెట్ ఆడేందుకు చాలాసార్లు వచ్చానని ఇక్కడి బిర్యానీ ఎంతో ఇష్టమని తెలిపారు.



షాబాద్‌లో ఎండిపోయిన వేప చెట్టు

వేపకు మళ్లీ తెగులు

జిల్లా వ్యాప్తంగా ఎండిపోతున్న వృక్షాలు

షాబాద్: ఔషధ తయారీలో ఉపయోగించే వేప చెట్లకు మళ్లీ తెగులు సోకింది. స్వచ్ఛమైన గాలిని అందించే వృక్షాలు వైరస్ బారిన పడ్డాయి. తెగులుతో ఆకులు, కొమ్మలు ఎండి కింద పడిపోతున్నాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న చెట్లు తిరిగి కోలుకోలేని పరిస్థితి నెలకొంది. నిత్యం కళకళలాడే వేపచెట్లు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఎండిపోయి కనిపిస్తున్నాయి. దీంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలకు అమ్మవారు పోస్తే నయం చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వేప ఆకులు వాడుతుంటారు. దీనికి తోడు పల్లెల్లో ఎక్కువ మంది ఇప్పటికీ పళ్లు తోముకునేందుకు వేప పుల్లను వినియోగిస్తుంటారు. వేప పుల్లతో పళ్లు తోమకుంటే సగం రోగాలు దరి చేరవని నమ్మకం. అలాంటి చెట్లకే వైరస్ సోకి పూర్తిగా ఎండిపోతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి తెగులు నివారణకు చర్యలు తీసుకొని చెట్లను రక్షించాలని కోరుతున్నారు.

పోరాటాలతోనే ఇళ్ల స్థలాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హయత్‌నగర్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లోని భూదాన్ భూమిలో చేపట్టిన గుడిసెలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన జెండా పాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు ఇస్తుందని పేదలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ సర్కారులో చలనం కనిపించడం లేదని మండిపడ్డారు. పోరాటాల ద్వారానే ఇంటి స్థలాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ప్రజలే ఇళ్లు నిర్మించుకోవాలని, పేదలకు అండగా సీపీఐ ఉంటుందని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గుడిసెలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాంబశివరావు తదితరులు

చిచ్చుపెట్టే శక్తుల్ని దూరం పెట్టాలి



వెంకయ్య నాయుడును సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్: కులం, మతం, భాష, వర్ణం, వర్గం పేర్లతో ప్రజల్ని విభజించే వ్యక్తుల్ని, శక్తుల్ని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారతమాత మహాహారతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మన భూమి వీరుల పురుటిగడ్డ, ఇక్కడి వీరులంతా శాంతి కోసం జీవితాలు త్యాగం చేశారే తప్ప యుద్ధ కాంక్షతో కాదన్నారు. చరిత్ర తిరగేస్తే యుద్ధాల్లో భారతీయులు సాధించిన విజయాలు కనిపిస్తాయి కానీ అవేవీ మన దేశ విస్తీర్ణం పెంచుకోవాలని చేయలేదని గుర్తు చేశారు. శాంతి అహింస మన రక్తంలో ఉన్నాయన్నారు. విశాల భారతదేశం తత్వ గణిత శాస్త్రాల్లో ప్రపంచానికే తల్లిగా ఉండేదన్నారు. లాభదాయకమైన వ్యవసాయంతో, సుసంపన్నంగా, కళాసంపదతో ఉన్న మన దేశంలో బ్రిటిషర్లు ప్రవేశించి మనల్ని అన్ని రకాలుగా దోచుకున్నారన్నారు. వారిపై జరిపిన పోరాటాలు, వీరుల త్యాగాల నుంచి యువతరం స్ఫూర్తి పొందాలనేది తన ఆకాంక్ష అన్నారు. తాను విదేశాలకు వెళ్లినప్పుడు తన సాదా సీదా దుస్తులు చూసి ఎవరూ అగౌరవపరచలేదు కాబట్టి కన్నతల్లిని, మాతృభూమిని, మాతృభాషని మనం ఎప్పుడూ మరచిపోకూడదని ఉద్బోధించారు. మనదైన సంస్కృతి, సంప్రదాయం, సంగీతం, 64కళలను గౌరవించుకోవాలన్నారు. మాతృభాష కళ్లలాంటిది, పరాయి భాష కళ్లద్దాల్లాంటివని.. తెలిపారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయులు టంగుటూరి, అల్లూరి, కొమరంభీమ్, కట్ట బ్రహ్మణ జీవిత చరిత్రలు మన చరిత్రలో భాగం కావాల్సి ఉందన్నారు. జనాల జీవితాల్లో వెలుగులు నిండినప్పుడే అసలైన పండగ అని తెలిపారు.

నా తరఫున బంటి వస్తున్నాడు..

- ఆశీర్వదించి.. ఆదరించండి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రగతి నివేదన పాదయాత్ర ప్రారంభం



నందివనపర్తి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



తల్లిదండ్రుల ఆశీస్సులు పొందుతున్న ప్రశాంత్

యాచారం: 'ప్రశాంత్‌కుమార్‌రెడ్డి(బంటి)ని ఆశీర్వదించండి.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 14 ఏళ్లుగా నేను చేసిన అభివృద్ధిని మీకు వివరించి.. మీ సమస్యలను నా దృష్టికి తెచ్చేందుకే బంటి ప్రగతి నివేదన పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన కుమారుడు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఆదివారం నందివనపర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించి నియోజకవర్గంలో రూ.2,391 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. 150 కిలోమీటర్ల మేర రోడ్లు వేయించానని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 23 కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశానని తెలిపారు. వచ్చే రెండేళ్లలో డిండి ప్రాజెక్టు ద్వారా ఇబ్రహీంపట్నంలోని ప్రతీ చెరువును నింపి, సాగునీరు అందిస్తామని స్పష్టంచేశారు. రూ.15 కోట్లతో పెద్దచెరువుకు మరమ్మతులు చేయడంతోనే పూర్తిగా నిండి అలుగు పారుతోందన్నారు. ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తోందని, 20 వేల మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. యాచారం మండలంలో మైనింగ్ జోన్ ఏర్పాటు చేయనీయబోమని ప్రకటించారు. ఈ నెల 29 నుంచి శుభోదయం పేరుతో తాను వారంలో మూడుసార్లు పార్టీ సీనియర్లను కలిసి సమస్యలను తెలుసుకుంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకే ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు.

నందీశ్వరుడికి పూజలు..

మంచిరెడ్డి సెంటిమెంట్ ఆలయమైన నందివనపర్తిలోని నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాదయాత్ర ప్రారంభింపజేశారు. అంతకుముందు బంటి తమ నివాసంలో తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. బహిరంగ సభ అనంతరం నందివనపర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర నక్కర్తమేడిపల్లి వరకు సాగింది. వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ బిడ్డగా వస్తున్నా..

తన తండ్రి ఆశయాలను కొనసాగించేందుకు.. మీలో ఒకడిగా ఉండేందుకే పాదయాత్ర చేపట్టానని బంటి అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు. ప్రగతి నివేదనలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం తన తండ్రి ద్వారా రూ.5 కోట్ల నిధులు వెచ్చిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ పి.కృపేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌గౌడ్, పాశ్చ బాషా, నందివనపర్తి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ అలక

ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్ర సభకు జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ గైర్హాజరయ్యారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ సమన్వయంతో వ్యవహరించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రజానివేదన ప్రారంభానికి సైతం రాలేదు. ఆమెను సముదాయించేందుకు ఎంపీపీ కృపేష్ చేసిన కృషి ఫలించలేదు. జంగమ్మ, ఆమె భర్త యాదయ్యకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదివారం రెండుసార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. పార్టీ మండల అధ్యక్షుడు తమ గౌరవానికి భంగం కలిగిస్తున్నారని జెడ్పీటీసీ ఆరోపించారు.

పారిశ్రామిక కారిడార్‌గా కొత్తూరు

సిద్ధాపూర్, పెంజర్లలో ఏర్పాటు
- 450 ఎకరాల భూసేకరణ పూర్తి
- ఉపాధి అవకాశాలపై స్థానికుల ఆశలు

కొత్తూరు: రాష్ట్ర రాజధానికి అతి చేరువలో.. అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో.. రోడ్డు, రైలు మార్గాలు ఉన్న కొత్తూరు మండలం పారిశ్రామిక కారిడార్‌గా రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఇక్కడ పలు బహుళ జాతి పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం కొత్తగా మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో 330, పెంజర్లలో 120 ఎకరాల్లో మరో రెండు పారిశ్రామిక వాడలను (ఇండస్ట్రియల్ పార్క్) ఏర్పాటు చేసే పనులను 8 నెలల క్రితం ప్రారంభించింది. పలు సందర్భాల్లో మంత్రి కేటీఆర్ సైతం సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేసే పారిశ్రామికవాడలో ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. మండలంలో కొత్తగా మరో రెండు ఇండస్ట్రియల్ పార్క్‌లు రానుండడంతో అభివృద్ధి, ఉపాధిపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

450 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కులు

సిద్ధాపూర్ శివారులోని 252, 278, 361 సర్వే నంబర్లలో గల 330.34 ఎకరాల ప్రభుత్వ, అలాగే అసైన్డ్ భూములను ఇటీవల అధికారులు టీఎస్ఐఐసీకి బదలాయించారు. 330.34 ఎకరాల్లో 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, మిగితా 240 ఎకరాలు అసైన్డ్ భూములను రైతుల నుంచి సేకరించారు. అంతేకాకుండా పెంజర్ల గ్రామ సర్వే నంబర్ 389లోని 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కొందరు రైతులకు నోటీసులు ఇవ్వడంతో పాటు అసైన్డ్ భూముల సర్వేను పూర్తి చేసి రైతుల వివరాలు సేకరించారు.

ఉపాధిపై ఆశలు

పాలమూరు జిల్లాలో నుంచి వలసలను అరికట్టి స్థానికంగానే వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1976లో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రం సమీపంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 120 వరకు మధ్య, చిన్న తరహా, పదుల సంఖ్యలో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో స్థానికులతో పాటు బీహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌కు చెందిన వేలమంది కార్మికులు పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా సిద్ధాపూర్‌లో మరో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నట్లు ప్రచారం జరగుతుండడంతో ఉపాధిపై స్థానికులకు ఆశలు మరింత చిగురిస్తున్నాయి. పూర్తిస్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటయితే వేల సంఖ్యలోనే ఉపాధి లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో ఉపాధి కోసం అర్హత ఉన్న స్థానికులకు మొదటిగా ప్రాధాన్యత ఇవ్వాలని భూములు కోల్పోయిన రైతులు కోరుతున్నారు.



సిద్ధాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం కేటాయించిన భూమి

స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి



కొత్తగా ఏర్పాటవుతున్న పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో చట్ట ప్రకారం స్థానిక నిరుద్యోగ యువతకు అర్హతలను బట్టి అన్ని హోదాల్లో ఉపాధి కల్పించే విధంగా పాలకులు, అధికారులు, చర్యలు తీసుకోవాలి. గతంలో కొత్తూరులో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పలు పరిశ్రమల నిర్వాహకులు పెద్దగా స్పందించడం లేదు. దీంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు నష్టం కలిగింది. ఇలాంటి పరిస్థితి ఇక్కడ రాకుండా చూసుకోవాలి. అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

భూ సేకరణ పూర్తి

సిద్ధాపూర్ గ్రామంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల సేకరణ దాదాపుగా పూర్తయ్యింది. ఇప్పటి వరకు 330 ఎకరాలు సేకరించి టీఎస్ఐఐసీకి బదలాయించాం. పొలాలు కోల్పోయిన 245 మంది రైతులకు పరిహారం కూడా అందజేశాం.

– రాజేశ్వరి, ఆర్డీఓ, షాద్‌నగర్

మహిళల రక్షణ బాధ్యత షీ టీమ్స్‌దే

షీ టీమ్ డీసీపీ శిరీష

బడంగ్‌పేట్: విద్యార్థులకు జ్ఞానాన్ని ఇవ్వడమే కాదు సమాజంలో ఉన్న రుగ్మతలను ధైర్యంగా ఎదుర్కొనే సత్తాను పెంచే విషయ పరిజ్ఞానాన్ని కూడా అందించే బాధ్యత ప్రతి పాఠశాల సిబ్బందిపై ఉందని షీ టీమ్ డీసీపీ సీ శిరీష సూచించారు. బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌ను షీ టీమ్స్ అధికారులు సందర్శించారు. చేయి చేయి కలుపుదాం – ఈవ్‌టీజింగ్‌ను అరికడదాం అని నినాదాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ డీసీపీ మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో మహిళల రక్షణ, భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వారికి అన్ని విధాలా అండగా ఉంటోందన్నారు. ఈవ్‌టీజింగ్‌కు విద్యార్థినులు, బాలికలు, మహిళలు భయపడరాదని సూచించారు. ఆపదలో ఉన్నా సీరియస్ ఇష్యూ అయినా షీ టీమ్స్ మీకు అండగా ఉందన్న విషయాన్ని మరచిపోకూడదని తెలిపారు. ఎక్కడ మీపై ప్రత్యక్ష, పరోక్ష, దాడులు, లైంగిక వేధింపులు జరిగినట్లయితే వెంటనే డయల్ 100కు, లేదా 9490616555, 040 27852355 నెంబర్లకు కాల్ చేస్తే వెంటనే మా బృందం అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని రక్షిస్తుందని భరోసా ఇచ్చారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. నైతిక విలువల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. షీ టీమ్స్ అంటే పోలీస్ డిపార్ట్‌మెంటేనని తెలిపారు. మహిళా పోలీసులతో ఈ షీ టీం పనిచేస్తుందని పేర్కొన్నారు. షీ టీమ్స్‌ను ఎలా అప్రోచ్ కావాలో ఫోన్ నెంబర్లతో సహా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైలజారెడ్డి, ఉమెన్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ గీత గోటి, షీ టీమ్స్ అధికారి అనందిత, షీ టీమ్స్ బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షీ టీమ్ అధికారులతో బోయిన్‌పల్లి పాఠశాల విద్యార్థులు

మొక్కలతో కాలుష్య రహిత సమాజం

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



మొక్కలు నాటుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో నాగార్జున్, వెంకటేశ్, కృష్ణ, సురేశ్, అంజి, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం

- అట్టహాసంగా విగ్రహ ప్రతిష్ఠాపన
- పాల్గొన్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



బసవేశ్వరుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మహిళల కోలాట నృత్య ప్రదర్శన

కడ్తాల్: మహనీయుడు విశ్వగురువు బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకమని ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో హనుమాన్‌ఘడ్ ఆలయ పరిసరాల్లో వీర శైవలింగాయత్ లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవేశ్వరుడి ఉత్సవ విగ్రహాన్ని శివాలయం నుంచి హనుమాన్ ఘడ్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా సంప్రదాయ భజనలు, కీర్తనలు, కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఈ వేడుకలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఆధ్యాత్మిక గురువు సూర్యనారాయణశాస్త్రి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, బీజేపీ రాష్ట్ర నాయకుడు జర్నలిస్ట్ సంగప్ప, సంఘం రాష్ట్ర నాయకులు శంకర్ పాటిల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం హనుమాన్ ఘడ్ ఆలయ పరిసరాల్లో బసవేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆచారి, జర్నలిస్ట్ సంగప్ప, శుభప్రద్ పటేల్ తదితరులు మాట్లాడారు. బసవేశ్వరుడి గొప్పతనాన్ని, ధర్మాన్ని వివరించారు. ఆయన బోధనలను కొనియాడారు. బసవేశ్వరుడి బోధనలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం రాష్ట్ర నాయకులు మాట్లాడారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీల్లో చేర్చాలని వారు కోరారు. అనంతరం సమాజం నూతన క్యాలెండర్ వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడు నేతి ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకులు సర్వేశ్వర్, శరణప్ప, మల్లప్ప, డాక్టర్ రమేశ్, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మహేందర్ మృతదేహం

శంకర్‌పల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన చాకలి మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు చేసి మద్యం సేవించేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి భార్య సంధ్య, పిల్లలతో గొడవ పడ్డాడు. వారిని బయటకు వెళ్లగొట్టాడు. అర గంట తర్వాత భార్య ఇంట్లోకి వెళ్లి చూడగా భర్త ఉరివేసుకొని కనిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



నవబాబు(ఫైల్)

శంకర్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన పున్నయ్య రెండు సంవత్సరాలుగా మేస్త్రీ పని చేసుకుంటూ శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో ఉంటున్నాడు. అక్టోబర్‌లో తన అన్న కుమారుడు నవబాబు(16)ను తన ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ నెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాబు తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

మదర్సాకు సీసీ రోడ్డు

ప్రారంభించిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ఆదివారం మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పర్యటించారు. పహాడీషరీఫ్ గ్రామం 14వ వార్డులోని అల్ జమాత్ ఉల్ ఫారూఖియా మదర్సాకు ప్రైవేట్‌గా వేసిన సీసీ రోడ్డు, కాన్ఫరెన్స్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, ఎంఐఎం ఇన్‌చార్జ్ అహ్మద్ సాది, కౌన్సిలర్ హమీదా దస్తగిరి, నాయకులు ఖదీర్, హసన్ షా, హలీం, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద విగ్రహావిష్కరణలో పాల్గొన్న స్వామిజీలు, బీజేపీ నాయకులు

రామకృష్ణ మఠం పీఠాధిపతులు యోగిశనంద, శీతేశానంద స్వాములు

కేశంపేట: యువత వివేకానందుడి బోధనలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రామకృష్ణమఠం పీఠాధిపతులు స్వామి యోగిశనంద, స్వామి శీతేశనందలు అన్నారు. ఆదివారం మండలంలోని చౌలపల్లిలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ వీరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్ కుమార్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, విథున్‌రెడ్డి, వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు, సభ్యులు కృష్ణయాదవ్, యాదయ్య, పద్మ కృష్ణ, శేఖర్, గిరి, సత్యనారాయణ, శ్రీకాంత్, రఘురాం గౌడ్, మోటే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలారిష్టాలు అధిగమించని జల్‌పల్లి మున్సిపాలిటీ

- ఏడేళ్లవుతున్నా తీరని సిబ్బంది కొరత
- పరిష్కారం కాని సమస్యలు
- ఇబ్బందుల్లో జనం
- పట్టించుకోని పాలకులు



జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

పహాడీషరీఫ్: జల్‌పల్లికి మున్సిపాలిటీ హోదా లభించి ఏడేళ్లు కావస్తున్నా బాలారిష్టాలను అధిగమించడం లేదు. సమస్యలకు పుట్టినిల్లుగా ఉన్న ఈ మున్సిపాలిటీలో సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కీలక పోస్టులతో పాటు సాధారణ సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరగడంతో పాటు ప్రజలకు సకాలంలో సరైన సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. లక్షకు పైగా జనాభా, 28 వేల కుటుంబాలు, 30 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ మున్సిపాలిటీలో అన్ని పోస్టులు భర్తీ చేసినప్పుడే సమస్యలు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా..

జల్‌పల్లి, బాలాపూర్ పార్ట్, కొత్తపేట, పహాడీషరీఫ్ గ్రామాలను కలిపి 2016లో జల్‌పల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ నాలుగు గ్రామాల్లో ఉన్న 50 వేల జనాభాను మాత్రమే పరిగణనలోకి తీసుకొని ఈ మున్సిపాలిటీని థర్డ్ గ్రేడ్‌గా నిర్ణయించారు. సాధారణంగా ఆదాయం, జనాభ ఆధారంగా మున్సిపాలిటీలను స్పెషల్, సెలెక్షన్, 1,2,3 గ్రేడ్‌లుగా విభజిస్తారు. ఈ గ్రేడ్‌ల ఆధారంగానే ఆయా మున్సిపాలిటీలకు నిధులు, సిబ్బంది నియామకం ఉంటుంది. కానీ గత జనాభా ఆధారంగా జల్‌పల్లిని థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీ కింద పరిగణించారు. దీంతో నిధులు కేటాయింపుతో పాటు సిబ్బంది నియామకంలోనూ తీరని అన్యాయమే జరుగుతోంది.

రెండు మున్సిపాలిటీలకు ఒక్కరే టీపీవో

నిబంధనల ప్రకారం ప్రతి పది వేల మందికి 28 మంది పారిశుద్ధ్య కార్మికుల చొప్పున ఈ మున్సిపాలిటీలో కనీసం 300కి పైబడి కార్మికులు ఉండాల్సి ఉంది. కానీ కేవలం 70 మంది మాత్రమే కొనసాగుతున్నారు. అనధికార లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలకు అడ్డాగా ఉన్న ఈ మున్సిపాలిటీకి రెగ్యులర్ టీపీవో కూడా లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న టీపీవో హబీబున్నీసా జల్‌పల్లి, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో వారానికి మూడు రోజుల చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెగ్యులర్ టీపీవోతో పాటు రెండు టీపీబీవోలు కూడా నియమించాల్సి ఉంది. ఇక కీలకమైన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్ కూడా ఖాళీగానే ఉంది. ఇటీవల మున్సిపాలిటీకి కేటాయించిన వీఆర్‌వోలు రెండు భాగాల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా కొనసాగుతున్నారు. ఇక జేఏవోగా కూడా రెండు మున్సిపాలిటీలలో విధులు నిర్వర్తిస్తున్నారు. అరకొర సిబ్బంది అక్రమ కంపెనీలలో దాడులు చేసేందుకు వెళ్లి దాడులకు సైతం గురవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

అరకొర సిబ్బందైనా టార్గెట్లు చేయాల్సిందే

సిబ్బంది కొరతను పట్టించుకోని ఉన్నతాధికారుల దృష్టంతా టార్గెట్‌లను పూర్తి చేయించడంపైనే ఉంటుంది. సాధారణ విధులు నిర్వహించే సిబ్బందికి అదనంగా ప్రతి నెలా ఏదో ఒక అదనపు లక్ష్యాలను నిర్దేశిస్తుంటారు. భువన్ సర్వే, వ్యాక్సినేషన్, ఈ - శ్రమ్ లబ్ధిదారుల సర్వే, పీఎం స్వనిధి తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాలను అనుకున్న సమయంలో చేయాల్సిందే. ఇప్పటికైనా ప్రభుత్వం జల్‌పల్లికి మున్సిపాలిటీకి అవసరమైన మేర సిబ్బందిని నియమించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.